
క్లుప్తంగా

హైటెక్స్‌లో ఐ-రన్



మాదాపూర్: బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో-2023లో భాగంగా మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఆదివారం ఐ- రన్ పేరిట మహిళల రన్‌ను నిర్వహించారు. నిర్వాహకుడు శామ్యూల్ సుధాకర్ మాట్లాడుతూ మహిళలు బిడియం, కంపెనీ లేకపోవడంతో ఎవరితో కలసి పరిగెత్తాలి, ఇంటి బాధ్యతలు.. ఈ మూడు కారణాల వల్ల పరుగులో పాల్గొనటం లేదన్నారు. ఈ అడ్డంకులను ఛేదించేందుకే తొలిసారిగా మహిళలతో రన్‌ను నిర్వహించినట్టు తెలిపారు. అన్ని వయస్సుల వారికి ఐరన్ బ్రేకింగ్ బారియర్స్ అనే ప్రత్యేకమైన థీమ్‌తో నిర్వహించినట్టు తెలిపారు. 14 సంవత్సరాల నుండి 76 సంవత్సరాల లోపు మహిళలు రన్‌లో పాల్గొన్నట్టు తెలిపారు.

సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలి

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రజలందరూ సోదర భావంతో కలిసిమెలిసి జీవించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుజరాత్ నుంచి పటాన్‌చెరుకు వచ్చిన లకులీష్ యోగాశ్రమం పీఠాధిపతి ప్రీతం మునీజీ మహరాజ్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రాజన్‌సింగ్, బండి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పంచాంగ పఠనంపై సమావేశం

పటాన్‌చెరు టౌన్: చైతన్యనగర్ కాలనీలోని శ్రీ హనుమాన్ ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణంపై బీఆర్ఎస్‌నేత గూడెం మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, పండితులు, పెద్దలతో కలిసి పంచాంగ పఠనం కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా మెట్టుకుమార్ మాట్లాడుతూ...మార్చి 22న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు వేద పండితుల చేత పంచాంగ పఠనం ఉంటుందని కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, పెద్దలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ న్యూస్ పోర్టల్ ప్రారంభం

మాదాపూర్: ప్రపంచ వ్యాప్తంగా టాప్ 12 దేశాలకు సంబంధించిన బిజినెస్ వార్తలు, ఇంటర్వ్యూస్, అందించేందుకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మాదాపూర్‌లో న్యూస్ పోర్టల్‌ను ఆదివారం ఫౌండర్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రెన్యూర్స్ విజయ్‌పాల్‌రెడ్డి, డాక్టర్ షేక్ నమతుల్లా బాషా, న్యూస్ వాచ్ ఎడిటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీపై నేషనల్ కాన్ఫరెన్స్

మాదాపూర్: ప్రతి సంవత్సరం దాదాపు 1.4 మిలియన్ల మంది పాంక్రియాటిక్ క్యాన్సర్ బారిన పడుతున్నారని యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి తెలిపారు. మాదాపూర్ హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో అత్యంత అధునాతన రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీపై నేషనల్ కాన్ఫరెన్స్ లైవ్ వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగనిర్ధారణ తరువాత 10శాతం కంటే తక్కువ మంది రోగులు ఐదు సంవత్సరాలు మాత్రమే జీవిస్తున్నారని తెలిపారు. పొగాకు, ధూమపానం, అధిక ఆల్కహాల్, ఊబకాయం , జీవనశైలి క్యాన్సర్‌కు కారణమన్నారు. 50 సంవత్సరాల లోపు పురుషులు ఈ క్యాన్సర్ బారిన ఎక్కువ పడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి 500 మందికి పైగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు పాల్గొన్నారు.

సూర్య ది గ్రేట్..

● స్విమ్మింగ్‌లో పతకాలే పతకాలు
● చదువులోనూ ప్రతిభ.. అద్భుతాని వైకల్యం



స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్న గౌతమ్ సూర్య

శేరిలింగంపల్లి: దివ్యాంగుడైన ఓ బాలుడు స్విమ్మింగ్‌లో సత్తా చాటి శత పతకాలు సాధించాడు. పుట్టుకతోనే బధిరుడు (మూగ, చెవిటి) కాగా, తన మూడో ఏటనే ఈత నేర్చుకోవడం ఆరంభించాడు. కొద్దికాలంలోనే తన సామర్థ్యాన్ని ప్రదర్శించి అందరినీ 'అపుర' అని ఆశ్చర్యచకితులయ్యేలా చేశాడు. పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అతను ఈతలో మెనుదిరగక ప్రతిభ చాటుతూ పతకాలు సాధిస్తున్నాడు.

◆ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నివాసం ఉండే బి.శ్రీనివాస్ (కారు డ్రైవర్), పవన్ సుధల కుమారుడు బి.గౌతమ్ సూర్య కాచిగూడలోని బద్రుకా కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. గౌతమ్ సూర్య మూడేళ్ల ప్రాయం నుంచే స్విమ్మింగ్‌లో శిక్షణ పొంది, నాలుగేళ్ల వయస్సులో విజయవాడలో కృష్ణా నదిని ఈది 'శభాష్' అనిపించుకున్నాడు. విజయవాడలో కృష్ణా నదిలో అవతలి ఒడ్డుకు, తిరిగి ఇవతలి ఒడ్డుకు చేరుకున్నాడు.అనంతరం వారి కుటుంబం బతుకుదెరువు కోసం సికింద్రాబాద్‌కు షిఫ్ట్ అయ్యింది. నాలుగో యేడు నుంచి స్థానికంగా ఉన్న జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో 11సంవత్సరాల పాటు శిక్షణ పొందాడు. ఎనిమిదేళ్లుగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయిలో సాధారణ విద్యార్థులతో పోటీపడి వందకు పైగా పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 25వ నేషనల్ డెఫ్ సీనియర్ సోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు ఫిబ్రవరి 16,17 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో 5 పతకాలు కై వసం చేసుకున్నాడు. స్విమ్మింగ్‌తో పాటు చదువులో కూడా ప్రతిభ కనబరుస్తున్నాడని తల్లిదండ్రులు 'సాక్షి'కి తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీల్లో కూడా 85 శాతంపైనే మార్కులు సాధించాడు.

సాధించిన పతకాలు ఇవే...

◆ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించిన 25వ నేషనల్ డెఫ్ సీనియర్ సోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 1500 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించగా, 400 మీటర్లు, 800 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో సిల్వర్ మెడల్స్, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించాడు.

◆ ఝార్ఖండ్‌లో నేషనల్ గేమ్స్ ఆఫ్ డెఫ్ పోటీల్లో 400 మీటర్లు, 100 మీటర్ల సీనియర్ మెన్ ఫ్రీ విజేతగా నిలిచి బంగారు పతకాలు దక్కించుకున్నాడు.

◆ ఫ్రీ స్టైల్లో 800 మీటర్ల విభాగంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు.

◆ 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో సిల్వర్ మెడల్, 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో బ్రాంజ్ మెడల్

◆ 2017 ఏప్రిల్‌లో చెన్నైలో జరిగిన ఆల్ ఇండియా నేషనల్స్‌లో రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు.



ఝార్ఖండ్‌లో జరిగిన పోటీల్లో సర్టిఫికెట్ అందుకుంటున్న గౌతమ్ సూర్య (ఫైల్)



గౌతమ్ సూర్యను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ (ఫైల్)

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటా..



ఇంటర్నేషనల్ స్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తా. లైఫ్ లాంగ్ స్విమ్మింగ్ చేయడంతో పాటు చదువుపై శ్రద్ధ పెడతా. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా. తల్లిదండ్రులు, కోచ్‌ల సహకారంతో రాణించగల్గుతున్నా.

– బి.గౌతమ్ సూర్య

దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి



ఇప్పటి వరకు మా శాయశక్తులా గౌతమ్ కోసం వ్యయం చేశాం. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు. గౌతమ్ సూర్యకు హియరింగ్ మిషన్ అందించేందుకు ప్రభుత్వం, దాతలు సహకరించాలి. హియరింగ్ మిషన్స్ కొనుగోలు చేసే శక్తి మాకులేదు. వాటిని సమకూర్చితే ఇంకా రాణిస్తాడు. మరిన్ని వివరాలకు నంబర్ 9346302735లో సంప్రదించాలి.

–పవన్ సుధ, గౌతమ్ సూర్య తల్లి

◆ 2013లో జాతీయస్థాయిలో నాలుగు మెడల్స్ సాధించాడు. వాటిలో ఒకటి సిల్వర్ కాగా మూడు బ్రాంజ్ మెడల్స్

◆ రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన అనేక పోటీల్లో వందకు పైగా పతకాలు కై వసం చేసుకున్నాడు.

నృత్యాంజలి

శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బెంగుళూరుకు చెందిన అంకురం ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, దేవర్ధమా, నాగేంద్ర హరయా, కృతి, గణేశకౌతం, చారుకేశి, జతిస్వర, సుందర మోహన, అష్టపది తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు జాహ్నవి, నిసర్గ, నయన, మోనికలు పాల్గొన్నారు.

- మాదాపూర్



బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మాదాపూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాదాపూర్‌లో ఆదివారం బీఆర్ఎస్ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహిళాలోకం చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను గౌరవించే దేశంలో బీజేపీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, శ్యామ్, అనిల్‌కుమార్, రఘునాథ్, మహిళలు పాల్గొన్నారు.

కిడ్నీలపై అవగాహన.. బైక్ రైడ్



వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించిన మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది

మాదాపూర్: కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఆదివారం మెడికవర్ ఆస్పత్రి, హార్లే గ్రూప్ బంజారా చాప్టర్‌తో కలసి బైక్ రైడ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల్‌కిరణ్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదని, కిడ్నీలు మానవ శరీరంలోని ప్రధాన అవయవాలలో ఒకటన్నారు. రక్తాన్ని శుద్ధి చేసి అందులో నుంచి హానికరమైన మలినాలను తొలగించి తిరిగి శుద్ధమైన రక్తాన్ని శరీరానికి అందించే కీలక పాత్రను కిడ్నీలు పోషిస్తాయని తెలిపారు. కిడ్నీ వ్యాధులపై చైతన్యం పెంచుకోవడమే కాకుండా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారు బీపీ, షుగర్ ఉన్న వారు ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి కిడ్నీ స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, బైక్ రైడర్స్ పాల్గొన్నారు.

రాక్ లైటింగ్.. వాకింగ్ ట్రాక్..


● సమతానగర్ పార్కులో అత్యాధునిక సౌకర్యాలు
● సుందరీకరణ పనులకు శ్రీకారం
● రూ.1.80 కోట్లతో పనులు ప్రారంభం
● కాలనీలో ప్రత్యేక ఆకర్షణ



సమతానగర్ పార్కు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ పార్కు గత కొన్నేళ్లుగా పూర్తి నిరాదరణకు గురైంది. ఒకప్పుడు రాళ్లు, ముళ్లపొదలు దర్శనమిచ్చేవి. వాకర్స్ వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్ తప్ప ఎటువంటి సౌకర్యాలు ఉండేవి కావు. పార్కులను సుందరీకరించి వచ్చదనానికి ప్రతీకగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఇటీవల పార్కు సుందరీకరణ కోసం 1.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొద్ది రోజుల క్రితమే పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పార్కులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలను తీసి వేశారు. కొన్ని బండరాళ్లను తొలగించగా, మరికొన్ని బండరాళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇక చిన్నారుల కోసం పార్కులో ప్రత్యేక క్రీడా పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా రాక్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో ఫౌంటేన్, రాక్ లైటింగ్స్, వాకింగ్ ట్రాక్, యోగా క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. పార్కుల్లో మెరుగైన వసతులను కల్పించి పచ్చదనం పెంపొందించేందుకు ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే సమతానగర్ కాలనీలోని మరో పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రధానంగా పార్కులు, చెరువులను సుందరీకరించి ఆయా ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలు పార్కులతో పాటు చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సమతానగర్ పార్కు దుస్థితిపై కాలనీవాసులు, ప్రజా ప్రతినిధులు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పార్కును సుందరీకరించేందుకు నిధులు కేటాయించారు. వీలైనంత త్వరలో పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే..



పార్కులను సుందరీకరించి పచ్చదనానికి ప్రతీకలుగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని పార్కులను అభివృద్ధి చేసి అవసరమైన సదుపాయాలను కల్పించాము. సమతానగర్ పార్కు ఒకప్పుడు అధ్వానంగా ఉండేది. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చొరవతో పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించాము. పార్కులో ఏర్పాటు చేయనున్న యోగా సెంటర్, రాక్ గార్డెన్, వాటర్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్, రోప్ వంటి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

–నార్నే శ్రీనివాసరావు, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్

విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్

గచ్చిబౌలి: విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్ హుషారుగా సాగింది. మారుతి సుజుకి ప్రీమియం నెక్సా యొక్క గ్రాండ్ విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్‌ను నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సరికొత్త గ్రాండ్ విటారా కారు సామర్థ్యాన్ని ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ రోడ్ డ్రైవర్స్ బృందం కస్టమర్లకు నడిపి చూపించారు. ఏడు రకాలైన అత్యంత కఠినమైన దారులలో కస్టమర్లు నడిపారు. దీంతో 100 బుకింగ్‌లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఎర్ర పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వర రావు, రవికుమార్ యాదవ్ తదితరులు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ వెస్ట్ సాయినగర్‌లోని ఎర్ర పోచమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గత మూడు రోజులుగా యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం కమిటీ అధ్యక్షుడు గుండడి ప్రభాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గజ్జెల యోగానంద్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఎం. రవికుమార్ యాదవ్, మన్నాల హరీష్‌రెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, సురభి రవీంద్రరావు, వెస్ట్ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోచారం శివరాజు గౌడ్, అల్లూరి రామరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ శివాలయం వద్ద రూ. 27 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, నరసింహా రెడ్డి, బాల్జి, సూర్యవంశీ, లక్ష్మణ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కేపీహెచ్‌బీకాలనీ: శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రమ్య గ్రౌండ్‌లో ఏరియా డెంటల్ చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పరీక్షలు చేయించుకున్నారు. స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు కట్టా నరసింగరావు, ఏరియా డెంటల్ చారిటబుల్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ శ్వేత తెలిపారు.

సమస్యల పరిష్కారం..అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి



మాదాపూర్ డివిజన్‌లో మహిళల సమస్యలను వింటున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఆదివారం మాదాపూర్‌లోని సాయినగర్, హరిజనబస్తీ, గుట్టల బేగంపేట్, నవ భారత్‌నగర్, చంద్రానాయక్‌తండాలో ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తోపాటు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి సంతులిత, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. అసంపూర్తి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. నగరంలోనే శేరిలింగంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో విశేష ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు తెలంగాణలో తిరుగులేదని ఎమ్మెల్యే గాంధీ,ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మాదాపూర్ డివిజన్‌కు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే నెహ్రూనగర్‌లో కాంగ్రెస్, బీజేపీ ఖాళీ అయిందని, భవిష్యత్తులో అన్ని కాలనీలు, బస్తీలలో ఇలాంటి పరిస్థితే నెలకొంటుందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బృందావన్ టీచర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృందావన్ టీచర్స్ కాలనీలో అంతర్గత రహదారుల గుండా మురుగు నీటి కాలువ నిర్మించేందుకు అధికారులు నిర్ణయించగా, కాలనీవాసులు ఇందుకు అభ్యంతరం తెలిపారు. కాలనీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జయలక్ష్మినగర్‌లో నిర్మిస్తున్న కట్ట మైసమ్మ దేవాలయం, రాఘవేంద్రకాలనీ ఎల్లమ్మ దేవాలయాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహా గౌడ్ ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: చందానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఏఈ జి ఉమారాణి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు జాతీయ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల కారణంగా చందానగర్ ప్రధాన రోడ్డు, చందానగర్ విలేజ్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆమె తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


పటాన్‌చెరు టౌన్: కార్మికులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని హ్యామండ్ పవర్ సొల్యూషన్స్ కంపెనీ కార్మికులకు నూతన వేతన ఒప్పందం కుదిర్చిన సందర్భంగా పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్‌ను కార్మికులు పారిశ్రామికవాడలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంపెనీలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, వైస్ ప్రెసిడెంట్ రవి, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళ ఆత్మహత్య



పటాన్‌చెరుటౌన్: మద్యం మత్తులో ఓ మహిళ ఆత్మహత్య చేసుకొంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం ...కర్ణాటక రాష్ట్రానికి చెందిన రేణుక(38) బతుకుదెరువు కోసం కుటుంబంతో కలసి 15 ఏళ్ల క్రితం వచ్చి పటాన్‌చెరు చైతన్యనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. గత కొంత కాలంగా మద్యానికి బానిసైంది. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చింది. ఇంట్లో పిల్లలు ఉండగా వారిని బయటకు పంపి ఉరివేసుకొంది. గమనించిన పిల్లలు స్థానికుల సహకారంతో కిందకు దింపగా అప్పటికే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..



శాంతయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: చేపలు పట్టేందుకు వెళ్లి వలలో చిక్కుకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం...నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన శాంతయ్య(52) కుటుంబంతో వచ్చి పటాన్‌చెరు శివారు బంగారుగడ్డ బాలజీనగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం శాంతయ్య, అతడి స్నేహితుడు ఆంజనేయులుతో కలసి చేపలు పట్టేందుకు మూడువాగుల గుంట వద్దకు వెళ్లాడు. ఆంజనేయులుకు ఈత రాక పోవడంతో ఒడ్డున ఉన్నాడు. శాంతయ్య వల తీసుకొని కుంటలో ఈదుకుంటూ వెళ్లాడు. మధ్యలోకి వెళ్లాగానే కాలికి వల చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఆంజనేయులు జరిగిన విషయాన్ని మృతుడి భార్య నాగమ్మకు తెలపగా స్థానికుల సహకారంతో కుంటలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462